EVENING EDITION
సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
4PM
www.suryaa.com
శుక్రవారం
07-11-2025
పేజీలు: 02




## ఆర్‌సీబీ హెడ్‌కోచ్‌గా రంగరాజన్



రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) మహిళా క్రికెట్ జట్టు హెడ్‌కోచ్‌గా తమిళనాడు మాజీ స్పిన్నర్ మలోలన్ రంగరాజన్ నియమితుడయ్యాడు. గత సీజన్‌లో ఆర్‌సీబీకి హెడ్‌కోచ్‌గా పనిచేసిన లూక్ విలియమ్సన్..బిగ్ బాష్ లీగ్ (బీబీఎల్) కమిట్మెంట్లతో ఈ లీగ్‌కు దూరమవడంతో ఆ జట్టు కొత్త హెడ్‌కోచ్‌ను నియమించుకుంది.



# ది గర్ల్‌ఫ్రెండ్ రివ్యూ

వరుస విజయాలతో అలరిస్తోంది రష్మిక మందన్న. తన ఎంచుకునే కథలు, పాత్రల్లో వైవిధ్యం వుంటుంది. తొలిసారిగా తానే ప్రధాన పాత్రలో ఓ సినిమా చేసింది. అదే 'ది గర్ల్‌ఫ్రెండ్'. దీక్షిత్ శెట్టి మరోపాత్రలో కనిపించినప్పటికీ గర్ల్‌ఫ్రెండ్ రష్మిక సినిమానే ప్రచారంతోనే జనాల్లోకి వచ్చింది. రష్మిక మంచి ఫామ్ లో వుండటం, గీతా ఆర్ట్స్ నుంచి ఈ సినిమా రావడంతో మంచి అంచనాలు ఏర్పడ్డాయి. మరా అంచనాలని గర్ల్‌ఫ్రెండ్ అందుకుందా? రష్మిక సోలో హిట్ కొట్టిందా ? రివ్యూలో చూద్దాం. భూమా (రష్మిక మందన్న) పీజీ చేయడానికి హైదరాబాద్ లోని ఓ కాలేజ్ లో జాయిన్ అవుతుంది. అదే కాలేజ్ లో పీజీ చేయడానికి వచ్చిన విక్రమ్ (దీక్షిత్ శెట్టి) భుమాని ఇష్టపడతాడు. ఒక బలహీనమైన క్షణంలో భూమా కూడా విక్రమ్ ని ఇష్టపడుతుంది. విక్రమ్ కి జెలసీ, పోసిస్సివెన్స్ ఎక్కువ. తనది పాత కాలం మనస్తత్వం. విక్రమ్ తో రోజులు గడుపుతున్నకొద్ది భూమాకి కొన్ని విషయాలు అర్ధమౌతూవస్తుంటాయి. రిలేషన్షిప్ లో ఓ చిన్న బ్రేక్ కావాలని ఆడుతుంది. ఆ తర్వాత ఏం జరిగింది? విక్రమ్ ఎలా రియాక్ట్ అయ్యాడు ? ఈ కథలో దుర్గా (అను ఇమ్మానుయేల్) పాత్ర ఏమిటి? చివరికి భూమా ఎలాంటి నిర్ణయం తీసుకుందనేది మిగతా కథ. ఒక డీసెంట్ అమ్మాయికి, బయటికి మాత్రమే డీసెంట్ గా కనిపించే ఓ అబ్బాయి మధ్య జరిగే లవ్- బ్రేకప్ కథది. ప్రేమించిన అమ్మాయికి తను తప్పితే ఎవరూ అవసరం లేదని, పెళ్లి తర్వాత అమ్మాయి ఇంటికి పరిమితం కావాలనుకునే ధోరణిలో వుండే అబ్బాయిని ప్రేమించిన అమ్మాయి.. కొంత జర్నీ తర్వాత ఆ బంధం తనని ఉక్కిరిబిగ్గిరి చేస్తుందనే నిజాన్ని గ్రహించి ప్రేమకి గుడ్ బై చెప్పి మళ్ళీ కొత్త జీవితం ప్రారంభించడానికి ఎంత ధైర్యం చూపించాల్సివచ్చిందనే ఈ కథలో సారం. మంచి పాయింట్ ఇది. దర్శకుడు రాహుల్ చిత్రాన్ని ప్రేమకథలానే నడిపినా ఆ తర్వాత హీరో పాత్రలో వచ్చిన మార్పు ఈ కథని మరో దిశగా తీసుకెళుతుంది. రామ ఘట్టం వరకూ కథలో సంఘర్షణ ఎమిటనేది ఆడియన్స్ కి అంతగా రిజిస్టర్ కాకపోయినప్పటికీ.. వంటగది కుందేలుగా కనిపించిన రోహిణి ఎపిసోడ్ తర్వాత ఈ కథ మీద, హీరో క్యారెక్టర్ మీద ఆసక్తిఏర్పడుతుంది. ఇంటర్వెల్ తర్వాత కథని కాస్త సాగదీసిన ఫీలింగ్ కలుగుతుంది. రాహు రమేష్, రష్మిక, దీక్షిత్ మధ్య కాలేజ్ లో జరిగే ఘర్షణ సమయంలోనే రష్మిక బ్రేక్ చెప్పే అవకాశం వచ్చింది. విక్రమ్ లాంటి వాడు తనకి కరెక్ట్ కాదనే భూమా తేల్చేవచ్చు. కానీ ఆ పాయింట్ మరింత స్ట్రెచ్ చేశారు. బహుశా అమ్మాయిలు అంత తేలిగ్గా బ్రేకప్ చెప్పలేరనేది ఉద్దేశం కావచ్చు. బ్రేకప్ తర్వాత భూమా ఎదురుకున్న పరిస్థితులు, అక్కడి నుంచి తనలో వచ్చిన మార్పు, క్లైమాక్స్ భూమా ఇచ్చిన స్పీచ్ ఆకట్టుకునేలా వున్నాయి. అమ్మాయిలా కోణంలో చూసినప్పుడు ఈ సినిమా మరింత అద్భుతంగా వుంటుంది.భూమా పాత్రకి రష్మిక ప్రాణం పోషించింది. స్టేజ్ అంటే భయపడే అమ్మాయి .. చివరి స్టేజ్ ఎక్కి తన కథని ధైర్యంగా చెప్పకోవడం ఈ పాత్ర మారిన తీరుని చక్కగా చిత్రీకరించింది. బ్రేకప్ చెప్పే సన్నివేశాల్లో, క్లైమాక్స్ సీక్వెన్స్ లో ఆమె నటన మరోస్థాయిలో వుంటాయి. లవర్ గా మొదలై సైకోలా మారిపోయిన పాత్రలో కనిపించాడు దీక్షిత్. ఈ కథలో విలన్ లాంటి పాత్ర తనది. తన నటన పాత్రకు తగ్గట్టుగా సహజంగా కుదిరింది. రావు రమేష్ కి ఇలాంటి పాత్రలు కొత్తకాదు. విక్రమ్ తో గొడవపడే సీన్ ఇంటెన్స్ గా వచ్చింది. అను ఇమ్మానుయేల్ పాత్ర నిడివి చిన్నగా వున్న కథలో కీలకమైయింది. రోహిణి పాత్రకి డైలాగ్ లేదు. కానీ గుర్తుండిపోతుంది. రాహుల్ రవీంద్రన్ హెచ్వోడీ గా మెప్పించారు. మిగతా పాత్రలు పరిధిమేర వున్నాయి. హేషమ్ పాటలు కథకు తగ్గట్టుగా వున్నాయి. ప్రశాంత్ ఆర్.విహారి నేపథ్య సంగీతం ఎమోషన్ ని ఎలివేట్ చేసింది. కృష్ణన్ వసంత్ విజువల్స్ కథ టోన్ ని పట్టుకున్నాయి. దాదాపు ఓ కాలేజ్ లో సాగిపోయే కథ ఇది. ఆ వాతావరణంగా సహజంగా క్రియేట్ చేశారు. గీతా ఆర్ట్స్ నిర్మాణంలో క్వాలిటీ కనిపించింది.

### వీధికుక్కలు పబ్లిక్ ప్లేసుల్లో కనిపించొద్దు..

# సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

వీధికుక్కల సమస్యకు సంబంధించి సుప్రీంకోర్టు శుక్రవారం (నవంబర్ 7, 2025) మూడు ఆదేశాలు జారీ చేసింది. అమికస్ క్యూరీ నివేదికపై చర్యలు తీసుకోవాలని, ఇందుకు సంబంధించి అఫిడవిట్ సమర్పించాలని అన్ని రాష్ట్రాలను సుప్రీం కోర్టు ఆదేశించింది. మరో ఉత్తర్వులో, వీధికుక్కల విషయంలో రాజస్థాన్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను దేశవ్యాప్తంగా అమలు చేయాలని కోర్టు ఆదేశించింది. వీధికుక్కలను రహదారులు, రోడ్ల వెంబడి నుండి తొలగించి షెల్టర్లలో ఉంచాలని సూచించింది. మున్సిపల్ కార్పొరేషన్లు ప్రత్యేక గస్తీ బృందాలను ఏర్పాటు చేసి, వీధి కుక్కలపై 24 గంటల నిఘా నిర్వహించాలని పేర్కొంది. అంతేకాకుండా ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్ జారీ చేయాలని కూడా కోర్టు ఆదేశించింది. ముఖ్యంగా విద్యాసంస్థలు, క్రీడా సముదాయాలు, ఆసుపత్రులు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలోకి వీధి కుక్కలు ప్రవేశించకుండా కంచెలు ఏర్పాటు చేయడంతోపాటు ఇతర చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు తన మూడవ ఉత్తర్వులో ఆదేశించింది. వీధి కుక్కలకు టీకాలు వేయడం, స్టెరిలైజేషన్ తర్వాత వాటిని షెల్టర్లలో ఉంచాలని కోర్టు తెలిపింది. తన ఆదేశాలను ఎనిమిది వారాల్లోగా అమలు చేయాలని భారత అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ ఏడాది ఆగస్టు 11న, జస్టిస్ జె.బి. పార్దివాలా, ఆర్. మహదేవన్ లతో కూడిన ధర్మాసనం కుక్క కాటులను సీరియస్‌గా తీసుకుంది. ఢిల్లీ, నోయిడా, ఘజియాబాద్, గురుగ్రామ్, ఫరీదాబాద్ లలో ఉన్న అన్ని వీధి కుక్కలను షెల్టర్ హోమ్ లకే పరిమితం చేయాలని ఆదేశించింది. జంతు ప్రేమికులు ఈ చర్యను నిరసిస్తూ ఈ విషయాన్ని భారత ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకువచ్చారు. ఆ తర్వాత కేసును ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనానికి బదిలీ చేశారు. ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం తన మునుపటి ఉత్తర్వులను రద్దు చేస్తూ, ఢిల్లీ-ఎన్‌సిఆర్‌లో వీధి కుక్కలను పట్టుకోవడం, క్రిమిరహితం చేయడం, టీకాలు వేయడం, వాటిని తిరిగి వాటి ఆవాసాలలోకి విడుదల చేయాలని ఆదేశించింది. ఆగస్టు 22న, కోర్టు విచారణల పరిధిని విస్తరించింది. వివిధ



హైకోర్టులలో పెండింగ్‌లో ఉన్న కేసులను తనకే బదిలీ చేసింది. రాష్ట్రాలను అఫిడవిట్లు దాఖలు చేయాలని కోరింది. అయితే, రెండు రాష్ట్రాలు మాత్రమే రెండు నెలల్లో అఫిడవిట్లు దాఖలు చేశాయి. అయితే తమ నోటీసుకు ప్రతిస్పందనగా రెండు రాష్ట్రాలు తప్ప మరెవరూ అఫిడవిట్లు దాఖలు చేయకపోవడం పట్ల న్యాయమూర్తులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఢిల్లీ ప్రభుత్వం కూడా అఫిడవిట్ దాఖలు చేయలేదు. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (MCD) మాత్రమే ఒక అఫిడవిట్ దాఖలు చేసింది.



## విలువలు ముఖ్యం: సమంత

నటి సమంత తాజాగా సోషల్ మీడియాలో అభిమానులతో ముచ్చటిస్తూ విద్యార్థులకు చదువుతో పాటు ఆరోగ్యం, జీవిత విలువలను అలవర్చుకోవాలని సూచించారు. తాను పాఠశాలలో నేర్చుకున్న స్నేహం, దయ, సానుభూతి వంటి లక్షణాలే జీవితంలో ఉపయోగపడ్డాయని తెలిపారు. 2023లో విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగాయని, మహారాష్ట్రలో అత్యధిక కేసులు నమోదయ్యాయని తెలిపే వార్తను పంచుకుని విచారం వ్యక్తం చేశారు. తన కొత్త తెలుగు సినిమా షూటింగ్ ఈ నెలలోనే ప్రారంభం కానుందని శుభవార్త అందించారు.

### వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్..

## భారత్ వేదికలు ఖరారు

వచ్చే ఏడాది ఫిబ్రవరి-మార్చిలో భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న టీ20 ప్రపంచకప్ నిర్వహణ కోసం భారత్ నుంచి ఐదు వేదికలను బీసీసీఐ షార్ట్‌లిస్ట్ చేసినట్టు సమాచారం. ఈ మెగా ఈవెంట్ కోసం అహ్మదాబాద్, ఢిల్లీ, కోల్‌కతా, ముంబై, చెన్నైని బోర్డు ఖరారు చేసినట్టు తెలుస్తున్నది. ఈ మేరకు బీసీసీఐ.. ఐసీసీకి తుది నివేదిక అందజేసినట్టు వినికిడి. శ్రీలంకలోనూ మ్యాచ్‌లు జరగాల్సి ఉండగా క్యాండీ, కొలంబో దాదాపు ఖాయమవగా మూడో వేదికను త్వరలోనే ఫైనల్ చేసే అవకాశముంది. పాకిస్థాన్ ఫైనల్ చేరితే (శ్రీలంకలో) తప్ప టైటిల్



పోరుకు అహ్మదాబాద్ ఆతిథ్యమివ్వనుండటం లాంఛనమే! వచ్చే వారం ఐసీసీ వేదికలను అధికారికంగా ప్రకటించనుంది.

### కింగ్ ఆఫ్ పాప్ మైఖేల్ జాక్సన్ బయోపిక్..

## టీజర్ విడుదల!




సంగీత ప్రపంచంలో చెరగని ముద్ర వేసిన దివంగత లెజెండ్ మైఖేల్ జాక్సన్ జీవితం ఆధారంగా తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'మైఖేల్'. ఎన్నో అంచనాల మధ్య రాబోతున్న ఈ చిత్రం నుంచి మేకర్స్ తాజాగా టీజర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రంలో మైఖేల్ జాక్సన్ పాత్రలో అతని మేనల్లుడు (సోదరుడు జెర్మైన్ జాక్సన్ కుమారుడు) జాఫర్ జాక్సన్ నటిస్తున్నాడు. జాఫర్ లుక్, డ్యాన్స్ మూమెంట్స్ అచ్చం కింగ్ ఆఫ్ పాప్‌ను పోలి ఉండటం అభిమానులను ఆకట్టుకుంటోంది. యాక్షన్ చిత్రాల దర్శకుడు ఆంటోయిన్ ఫుక్వా ఈ బయోపిక్‌ను తెరకెక్కిస్తుండగా.. ఆస్కార్ విజేత గ్రాహమ్ కింగ్ ఈ చిత్ర నిర్మాణ బాధ్యతలు తీసుకున్నాడు. మరోవైపు మైఖేల్ జాక్సన్ జీవితంలో ఉన్న వివాదాస్పద అంశాలను, బాల్యంలో జరిగిన లైంగిక వేధింపుల ఆరోపణలను ఈ బయోపిక్‌లో ఎలా చూపిస్తారు అనే దానిపై హాలీవుడ్‌లో ప్రస్తుతం చర్చ జరుగుతోంది. ఇక ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఏప్రిల్ 24, 2026న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.

## రైనా, ధవన్‌కు ఈడీ షాక్



భారత మాజీ క్రికెటర్లు సురేశ్ రైనా, శిఖర్ ధవన్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) షాకిచ్చింది. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ (1XBet) ప్రమోషన్ కేసులో ఈ ఇద్దరికి సంబంధించిన రూ. 11.14 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ యాప్‌నకు సంబంధించి మనీ లాండరింగ్ కేసును దర్యాప్తు చేస్తున్న ఈడీ.. ధవన్‌కు చెందిన రూ. 4.5 కోట్ల స్థిరాస్తి, రైనా రూ. 6.64 కోట్ల విలువైన మ్యూచుఫల్ ఫండ్స్‌ను అటాచ్ చేసినట్టు వెల్లడించాయి. వన్డే ప్రపంచ కప్ గెలిచిన భారత జట్టులోని సూపర్ స్టార్లకు మహిళల ప్రీమియర్ లీగ్ ట్వంటీ20 (WPL)లో అధిక డిమాండ్ ఉంది. భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (ముంబై ఇండియన్స్ - 2.5 కోట్లు), వైస్ కెప్టెన్ స్మృతి మంధాన (రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు -3.5 కోట్లు), రిచా ఘోష్ (బెంగళూరు - 2.75 కోట్లు), జెమిమా రోడ్రిగ్స్ (ఢిల్లీ క్యాపిటల్స్ - 2.2 కోట్లు), షఫాలి వర్మ (ఢిల్లీ - 2.2 కోట్లు)లను ఆయా ఫ్రాంచైజీలు అంటిపెట్టుకున్నాయి.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4 PM

# మహిళా క్రికెటర్ శ్రీచరణికి గన్నవరంలో ఘనస్వాగతం..
# రూ. 2.5 కోట్ల నగదును ప్రకటించిన ఏపీ సర్కార్




వన్డే వరల్డ్ కప్ కైవసంలో కీలక పాత్ర పోషించిన శ్రీచరణికి ఏపీ వాసులు ఘన స్వాగతం పలికారు. కడప జిల్లాకు చెందిన శ్రీచరణి వరల్డ్ కప్ సాధించిన తరువాత మొట్టమొదటిసారిగా విజయవాడకు వచ్చిన సందర్భంగా గన్నవరం ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర మంత్రులు అనిత, సవిత , పార్లమెంట్ సభ్యుడు, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని చిన్ని, శాప్ చైర్మన్ రవినాయుడు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె ఇండియా మాజీ కెప్టెన్ మిథాలిరాజ్‌తో కలిసి ఏపీ సీఎం చంద్రబాబు నివాసానికి వెళ్లారు. నివాసం వద్ద ఏపీ మంత్రి నారా లోకేష్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా వరల్డ్ కప్ గెలిచినందుకు శ్రీచరణిని అభినందించారు. ఈ సందర్భంగా శ్రీచరణికి ఏపీ సర్కార్ రూ. 2.5 కోట్ల నగదును, గ్రూప్ వన్ ఉద్యోగం, కడపలో భూమి ఇస్తామని ప్రకటించింది. శ్రీచరణి మాట్లాడుతూ ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌లో శిక్షణ పొందానని గుర్తు చేశారు. కప్ గెలవడం మొదటి అడుగు మాత్రమేనని.. ఇంకా ముందు చాలా ఉందని అన్నారు. కప్ గెలిచిన తరువాత ప్రధాని నరేంద్ర మోదీ భారత జట్టులోని ప్రతి సభ్యురాలని అభినందించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా జట్టు భవిష్యత్ కార్యాచరణపై సలహాలిచ్చారని తెలిపారు.



## మద్యం ప్రియులకు షాక్.. నాలుగు రోజులు వైన్స్ బంద్




జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్‌లో 4 రోజుల పాటు వైన్స్ బంద్ కానున్నాయి. నవంబర్ 9 సాయంత్రం 6 గంటల నుంచి నవంబర్ 12 సాయంత్రం 6 గంటల వరకు వైన్ షాపులు మూసివేయనున్నారు. ఓట్ల లెక్కింపు రోజు నవంబర్ 14న ఉదయం నుంచి కౌంటింగ్ పూర్తయ్యే వరకు, అవసరమైతే రిపోల్ రోజు కూడా మద్యం దుకాణాలు బంద్ కానున్నాయి. ఎక్సైజ్ చట్టం 1968లోని సెక్షన్ 20 ప్రకారం సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మోహంతీ ఆదేశాలు జారీ చేశారు. సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న అన్ని వైన్ షాపులు, కల్లు దుకాణాలు సహా రెస్టారెంట్లకు అనుబంధంగా ఉన్న బార్లు, స్టార్ హోటల్స్, రిజిస్టర్డ్ క్లబ్‌లలోని బార్లు మూసివేయనున్నారు. ప్రజాప్రతినిధుల చట్టం 1951 లోని సెక్షన్ 135-C ప్రకారం ఈ ఆదేశాలు జారీ చేయబడ్డాయని కమిషనర్ తెలిపారు. నవంబర్ 11న పోలింగ్ జరుగనున్న ఈ బైపోల్ లో 58 మంది అభ్యర్థులు పోటీపడుతున్నట్టు రిటర్నింగ్ అధికారి తెలిపారు. మొత్తం 211 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా.. 81 మంది అభ్యర్థులు అర్హత పొందారు. అయితే ఈసారి ఇంత మంది ఎన్నికల్లో పోటీ చేయడం జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ చరిత్రలో ఇదే తొలిసారి. 2009 ఎన్నికల్లో 13 మంది, 2014 ఎన్నికల్లో 21 మంది, 2018 ఎన్నికల్లో 18 మంది పోటీపడగా.. 2023లో జరిగిన ఎన్నికల్లో 19 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. వారిలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ విజయం సాధించారు. ఇటీవల ఆయన హఠాన్మరణంతో ఈ ఉపఎన్నిక జరుగుతోంది.

## ఆసియా కప్‌లో శీతల్.. రెగ్యులర్ ఆర్చర్లతో పోటీకి

భారత యువ ఆర్చర్ శీతల్‌దేవి తన సత్తాఏంటో చేతల్లో చూపెట్టింది. ఇప్పటికే పారా టోర్నీల్లో పతకాలు కొల్లగొడుతున్న శీతల్.. తాజాగా ఆసియాకప్ టోర్నీకి ఎదురైంది. జెద్దా వేదికగా త్వరలో జరిగే ఆసియా టోర్నీ కోసం ఎంపిక చేసిన జూనియర్ టీమ్‌లో శీతల్ చోటు దక్కించుకుంది. అన్ని అవయవాలు సరిగ్గా ఉన్న ఆర్చర్లతో పోటీపడ్డ ఈ జమ్ముకశ్మీర్ ఆర్చర్ 11.75 పాయింట్లతో ఓవరాల్‌గా మూడో స్థానంలో నిలిచింది.రెండు చేతులు లేకపోయినా కాలు సహాయంతో విల్లును ఎక్కుపెట్టే శీతల్ అద్భుత ప్రదర్శనతో ఆసియాకప్ బెర్తు దక్కించుకుంది. ఇటీవల జరిగిన పారా ఆర్చరీ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పతకం సాధించిన తొలి ఆర్చర్(రెండు చేతులు లేని)గా శీతల్ అరుదైన రికార్డును సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే.

## 12 తులాల బంగారం తిరిగిచ్చిన ఆటో డ్రైవర్



విజయవాడలో ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న చంద్రశేఖర్ తన నిజాయితీని చాటుకున్నారు. ఈరోజు ఉదయం వివాహానికి హాజరైన నంద్యాల జిల్లాకు చెందిన సూర్యనారాయణ, లక్ష్మీబాయి దంపతులు మారుతి నగర్ నుంచి బస్టాండ్‌కు వెళ్లే హడావుడిలో, 12 తులాల బంగారు నగలు ఉన్న బ్యాగును ఆటోలోనే మర్చిపోయారు. ఆటోలో బ్యాగును గమనించిన డ్రైవర్ చంద్రశేఖర్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా దాన్ని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఆయన నిజాయితీకి మెచ్చుకొని, అర్బన్ డీఎస్పీ శ్రీనివాసులు ఆటో డ్రైవర్ చంద్రశేఖర్‌ను ఘనంగా సన్మానించారు. రోడ్డు మీద వెళ్తేటప్పుడు వందో, యాభై రూపాయలు దొరికితేనే తీసుకుని జేబులో పెట్టుకుంటాం. అలాంటిది ఏకంగా 12 తులాల బంగారం దొరికినా.. తిరిగి ఇచ్చి నిజాయితీని చాటుకున్నాడు ఆ ఆటో డ్రైవర్. తులం బంగారం లక్ష రూపాయలు దాటినా ఈ రోజుల్లో కూడా ఇంకా నిజాయితీపరులు ఉన్నారా.? అనిపిస్తుంది ఈ సంఘటన చూశాక.. నంద్యాల జిల్లాకు చెందిన సూర్యనారాయణ, లక్ష్మీబాయి దంపతులు ఓ వివాహ కార్యక్రమానికి హాజరయ్యేందుకు అనంతపురం పట్టణం వచ్చారు. వివాహ కార్యక్రమం అయిపోయాక మారుతీ నగర్ నుంచి బస్టాండుకు వెళ్లేందుకు ఆటో బుక్ చేసుకున్నారు సూర్యనారాయణ, లక్ష్మీబాయి దంపతులు. ఆటోలో బస్టాండుకు బయలుదేరి వెళ్లిన సూర్యనారాయణ, లక్ష్మీబాయి దంపతులు.. బస్టాండ్‌లో దిగి.. బస్సు ఎక్కే హడావుడిలో బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగ్ మర్చిపోయారు.12 తులాల బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగ్ తిరిగి ఇచ్చి నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్ చంద్రశేఖర్‌ను మెచ్చుకున్న పోలీసులు సన్మానించారు. సూర్యనారాయణ, లక్ష్మీబాయి దంపతులకు డిఎస్పి శ్రీనివాసులు బంగారు ఆభరణాలను అందజేశారు. ఆటోడ్రైవర్ చంద్రశేఖర్ నిజాయితీకి బాధితులు సూర్యనారాయణ, లక్ష్మీబాయి దంపతులు కూడా ఆర్థిక సాయం చేసి నిజాయితీని మెచ్చుకున్నారు. 12 తులాల బంగారం అంటే దాదాపు 12 లక్షల రూపాయల విలువ ఉన్నప్పటికీ ఆటో డ్రైవర్ చంద్రశేఖర్ నిజాయితీ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిస్తుంది.



## బుక్‌మైషో కంపెనీలో ఇంటర్న్‌షిప్‌లకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రముఖ ఆన్‌లైన్ టికెటింగ్ ప్లాట్‌ఫామ్ బుక్‌మైషో కంపెనీ.. సినిమా, కన్‌సర్ట్స్, క్రీడా కార్యక్రమాలు, థియేటర్ ప్రదర్శనలు వంటి ఇతర వినోద కార్యక్రమాల కోసం టికెట్లను బుక్ చేసుకోవడానికి జనాలకు అందుబాటులో ఉండే ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం. ఇది సినిమాలు, ఈవెంట్‌లు, స్ట్రీమింగ్ సేవలు, అలాగే వివిధ ప్రమోషనల్ ఆఫర్‌లను అందిస్తుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని బుక్‌మైషో కంపెనీ నిరుద్యోగులకు ఇంటర్న్‌షిప్ ఆఫర్ ఇస్తూ ప్రకటన వెలువరించింది. ఇందులో ట్రైనీ — లైవ్ ఎంటర్‌టైన్‌మెంట్ (యాక్టివిటీస్) ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతోంది. అర్హత కలిగిన అభ్యర్థులు నవంబరు 27, 2025వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. బుక్‌మైషో కంపెనీలో ట్రెయినీ — లైవ్ ఎంటర్‌టైన్‌మెంట్ (యాక్టివిటీస్) ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం వచ్చి ఉండాలి. అలాగే ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్‌లో నైపుణ్యం ఉండాలి. ఫుల్ టైం ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం మొత్తం 6 నెలల వ్యవధి వరకు ఉంటుంది. డిసెంబర్ 2వ తేదీ నుంచి ఈ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం ప్రారంభమవుతుంది. ఎంపికైన వారు ప్రతి నెలా రూ.రూ.11,250 చొప్పున స్టైపెండ్ చెల్లిస్తారు. ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత పొందిన వారితోపాటు ప్రస్తుతం డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా ఈ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.



## తుఫానుతో దెబ్బతిన్న పత్తి పంట.. పత్తాలేని వ్యవసాయ అధికారులు

ఇటీవల కురిసిన మొంథా తుఫాన్ దాటికి ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలో వందల ఎకరాల్లో పత్తి పంటకు నష్టం వాటిల్లింది. మూడు రోజులపాటు కురిసిన భారీ వర్షాల కారణంగా దిగుబడికి వచ్చిన పత్తి తడిసి ముద్దయింది. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత పత్తి క్రమంగా నల్లబడుతుండటంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం శ్రమించి అధిక పెట్టుబడులతో సాగు చేసిన పత్తి పంట అకాల వర్షం వల్ల దెబ్బతినడంతో కన్నీరు మున్నీరవుతున్నారు. సగానికి పైగా దిగుబడులు తగ్గడంతోపాటు చేతికందిన పత్తి దూది వాన నీళ్లకు తడిసి నేల పాలవడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రకృతి వైపరీత్యానికి నష్టపోయిన పత్తి మినహాయించి మిగిలిన పత్తిని దిగుబడి చేసుకునేందుకు సిద్ధమవ్వగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో విక్రయాలు జరుపుకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలీలను పెట్టి పత్తి తీసినప్పటికీ కొనేవారు లేకపోవడంతో నల్లబడి పోతున్నదని ఆందోళన చెందుతున్నారు.



## పిచ్చెక్కిస్తున్న నేషనల్ క్రష్

ఈ ఫొటో షూట్ లో రష్మిక సంప్రదాయానికి ఆధునికతను జోడించి ఎంతో అందంగా కనిపించింది. ఆమె నాజూకు నడుమందాలు నెటిజన్లను ఫిదా చేస్తున్నాయి. ప్రతీ ఫొటో అందానికి పరాకాష్ట అన్నట్లుగా ఉంది. రష్మిక తన జుట్టును ముడివేసి.. పువ్వులతో అలంకరించడం సంప్రదాయ లుక్ ను జోడించింది. ప్రస్తుతం రష్మిక తన లేటెస్ట్ మూవీ 'థామా' మూవీ ప్రమోషన్స్ లో బిజీగా ఉంది. ఇందులో భాగంగానే గ్లామరస్ గా ముస్తాబైన ఫొటో షూట్ షేర్ చేసింది ఈ ముద్దుగుమ్మ. 'గీతా గోవిందం' సినిమాతో కుర్రాళ్ళ హృదయాలను కొల్లగొట్టిన రష్మిక.. వరుస సినిమాలు చేస్తూ కెరీర్ లో సక్సెస్ ఫుల్ గా రాణిస్తోంది.

## సిద్ధిపేటలో హృదయవిదారక ఘటన

రాను రాను మానవ సంబంధాలు ఎటు పోతున్నాయో తెలియని పరిస్థితి. అయిన వారి పట్ల మానవత్వం మరిచి ప్రవర్తిస్తున్న ఘటనలు ఎన్నో చూస్తున్నాం. కన్న తల్లిదండ్రులను పట్టించుకోని పిల్లలు చాలా మందే ఉన్నారు. కని, పెంచి, పెద్ద చేసిన పేరెంట్స్‌ను పట్టించుకోకుండా తమ దారి తాము చూసుకుంటున్నారు పిల్లలు. రెక్కలొచ్చాక ఎదిగిపోయి... ఏ మాత్రం పట్టించుకోని పిల్లలను చూస్తున్న వృద్ధ తల్లిదండ్రుల బాధ వర్ణణాతీతం. బతికున్నప్పుడు చూడపోయినా కనీసం చనిపోయినప్పుడు అయినా చివరి చూపు, దహన సంస్కారాలు చేస్తారని ఆశపడుతుంటారు తల్లిదండ్రులు. కానీ కొందరు వ్యక్తులు మాత్రం తమ కన్నవారు చనిపోయినా కూడా తమకేం పట్టనట్లు వ్యవహరిస్తుంటారు. చివరి చూపుకు కూడా రాకుండా మొహం చాటేస్తుంటారు. ఇలాంటి ఘటనే సిద్ధిపేట జిల్లాలో చోటు చేసుకుంది. వృద్ధాప్యంతో ఓ వ్యక్తి చనిపోయాడు. అతడికి సంతానం కూడా ఎక్కువే. కానీ ఏం లాభం చనిపోయిన తర్వాత ఆ వృద్ధుడి మృతదేహాన్ని కూడా చూసేందుకు రాని ఆ పిల్లలను చూస్తే అసలు వీళ్లు మనుషులేనా అన్న భావం కలగకమానదు.

